

ముగిసిన ఐటీఐ అడ్మిషన్ కౌన్సెలింగ్


ఎచ్చెర్ల, జూన్ 23: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశాలకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ఆదివారంతో ముగిసింది. మొత్తం 2,470మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఇందులో కౌన్సెలింగ్‌కు 1,138 మంది హాజరయ్యారు. 634 మంది వివిధ ఐటీఐల్లో సీట్లు పొందారు. వివిధ కారణాల వల్ల కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థుల కోసం ఈ నెల 25,26 తేదీల్లో మరోసారి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎస్.సుధ, జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు పర్యవేక్షణలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

అనుమతి లేకుండానే..

- భారీ భవంతిగా వైసీపీ జిల్లా కార్యాలయం
- మాజీమంత్రి ధర్మాన ఇంటి సమీపంలోనే నిర్మాణం
- దాదాపు తొంబై శాతం పనులు పూర్తి
- గత కమిషనర్ కొర్రీ వేసి.. వెనక్కి పంపిన ఫైల్
- కార్పొరేషన్ ప్లానింగ్ విభాగంలో స్వామిభక్తి చాటుకుంటున్న అధికారులు
- అక్రమాలపై స్పష్టత ఇవ్వని వైనం

కొత్త ప్రభుత్వం కొలువుదీరినా.. ఇంకా కొంతమంది అధికారులు గత వైసీపీ నాయకులపై స్వామిభక్తి వీడడం లేదు. గతంలో అడ్డగోలుగా చేసిన తప్పిదాలను సమర్థించుకుంటూనే ఉన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో అనుమతుల్లేకుండా అడ్డగోలుగా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని శనివారం కూల్చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో కూడా అనుమతుల్లేకుండానే అదే మాదిరి వైసీపీ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తుండడం చర్చనీయాంశమవుతోంది. దీనిపై అధికారుల నుంచి మాత్రం స్పష్టత కరువవుతోంది.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)


పెద్దపాడు సమీపంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

శ్రీకాకుళంలోని పెద్దపాడు వద్ద జాతీయ రహదారికి ఆనుకుని వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు ఇంటి సమీపంలో దీనిని నిర్మిస్తుండగా.. ఇప్పటివరకూ 90శాతం పనులు పూర్తయ్యాయి. కాగా.. దీని నిర్మాణానికి అనుమతులు లేకపోవడం గమనార్హం. మళ్లీ తామే అధికారంలోకి వస్తామనే ధీమాతో వైసీపీ నాయకులు ఈ భవనానికి అవసరమైన అనుమతులు తీసుకోకుండానే నిర్మాణ పనులు చేపడుతున్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ప్లానింగ్ విభాగం అధికారులు మాత్రం తమకెందుకులే అన్నట్లు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో సామాన్యుల విషయంలో ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే.. పనులను అడ్డుకుంటున్నారు. కానీ, వైసీపీ కార్యాలయం విషయంలో మాత్రం అటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎకరా యాభై సెంట్లలో భారీ భవనం

శ్రీకాకుళం నుంచి కోల్‌కత్తా హైవేరోడ్డులో కేంద్రీయ విద్యాలయం.. ఆపక్కనే మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు ఇల్లు.. ఆపక్కనే మరో భారీ భవంతి నిర్మిస్తున్నారు. ఎకరా యాభై సెంట్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ భవనం గురించి చాలామందికి తెలియనీయలేదు. వైసీపీ కార్యాలయంగా ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఈ ఏడాది జనవరి 31 వరకు చల్లా ఓబులేసు వ్యవహరించారు. వైసీపీ కార్యాలయం నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ అనుమతుల ఫైల్ ఆయన వద్దకు వెళ్లింది. ప్లాన్‌లో సరైన వివరాలు లేవని.. మళ్లీ ఫైల్ తనవద్దకు పంపాలని ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఆయన బదిలీపై శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీకి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఫిబ్రవరి 1న కమిషనర్‌గా తమీమ్ అన్సారియా బాధ్యతలు చేపట్టారు. ఆమె హయాంలో కూడా వైసీపీ కార్యాలయానికి సంబంధించి అనుమతులను సిద్ధం చేసుకోలేకపోయారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది తామే అని.. తమను ఎవరడుగుతారు.. పైగా పార్టీ కార్యాలయం జోలికి ఎవరెళ్తారని వైసీపీ నాయకులు అతిగా ఆలోచించారు. భవన నిర్మాణంపై పరోక్షంగా మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు పర్యవేక్షణ అధికంగా ఉన్నా.. పార్టీ అధ్యక్షుల పేరిట భవన అనుమతుల కోసం దరఖాస్తు చేసినట్లు సమాచారం. హైవే మీదుగా వెళ్తున్నవారికి ఇంతపెద్ద భవంతి ఎవరిదనే సందేహం ఉండేది. ఇప్పుడు అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయమని తెలుసుకుని నోరెళ్లబెడుతున్నారు.

ప్లానింగ్ అధికారుల మౌనం

ఇన్నాళ్లు గత స్వామి భక్తి చాటుకున్న శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ప్లానింగ్ అధికారులు.. ఇప్పటికీ మౌనమే వహిస్తున్నారు. కనీసం సమాచారం చెప్పలేని స్థితిలో ఉన్నారు. అనుమతులు లేవని బయటకు చెప్పలేక.. ఇన్నాళ్లు మౌనంగా ఉన్నందుకు తామెక్కడ దోషులవుతామో అన్న భయం వారిలో నెలకొంది. తాడేపల్లిలో వైసీపీ కార్యాలయానికి అనుమతులు లేకపోవడంతో కూల్చివేసిన సంఘటన తెలిసిందే. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అనుమతులులేని భవనాలకు నోటీసులు జారీచేసింది. ఇందులో భాగంగా ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. కానీ ఆ విషయాన్ని బయటకు మాత్రం పొక్కనీయడం లేదు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతల అక్రమాలకు సహకరించిన ప్లానింగ్ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయమై కనీసం వైసీపీ కీలక నాయకులెవరూ నోరు మెదపలేకపోతున్నారు.


తితలీ తుఫాన్ కారణంగా కొట్టుకుపోయిన పైడిగాం చానెల్


వృథాగా పోతున్న వరద నీరు (ఫైల్)

పడకేసిన.. పైడిగాం

- 'తితలీ'లో కొట్టుకుపోయిన ప్రధాన చానెల్
- మూడు మండలాలకు అందని సాగునీరు
- టీడీపీ హయాంలో రూ.9కోట్లు మంజూరు
- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కూటమిపైనే రైతుల ఆశలు

(సోంపేట)

వైసీపీ పాలనలో పైడిగాం ప్రాజెక్టు పడకేసింది. మూడు మండలాల పరిధిలోని వేలాది ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టుపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చలేదు. దీంతో ఎక్కడికక్కడ పూడికలు పేరుకుపోయి.. ప్రాజెక్టు దయనీయంగా మారింది. సక్రమంగా సాగునీరందక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

సోంపేట మండలంలో మహేంద్రతనయ నదిపై మాలగోవిందపురం పంచాయతీపై బాతుపురం- కొత్త బాతుపురం గ్రామాల మధ్య పైడిగాం ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా ఖరీఫ్ సీజన్‌లో సోంపేట, కంచిలి, మందస మండలాల పరిధిలోని 34 పంచాయతీల్లో సుమారు 10వేల ఎకరాలకు సాగునీరు అందేది. సోంపేట మండలంలో మాలగోవిందపురం పంచాయతీలోని పైడిగాం, హంసమొర, సుంకిడి పంచాయతీ పరిధిలోని విక్రంపురం, బుషాభద్ర, మాకన్నపురం పంచాయతీ, పొత్రఖండ, బేసిరామచంద్రపురం, కొర్లాం, పలాసపురం, సోంపేట, జింకిభద్ర పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల రైతులు ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాల్లో సాగుచేసేవారు. అలాగే కంచిలి మండలంలో శాసనాం, జే.నారాయణపురం, ఉప్పర పేటలు-3, చొట్రాయిపురం, గోకర్ణపురం, పోటిగుడ్డి, మధుపురం, బూరగాం గ్రామాల్లో రైతులకు కూడా సాగునీరందేది. మందస మండలం మందస, పొత్తంగి గ్రామాల పరిధిలో వందలాది ఎకరాలు సాగు చేసేవారు. ప్రస్తుతం ప్రాజెక్టు దయనీయంగా మారడంతో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- ఈ ప్రాజెక్టును 1963లో నిర్మించగా.. 185 క్యూసెక్కుల సామర్థ్యం మేర నీరు వచ్చేది. 1985లో ఒడిశా రాష్ట్రంలో పురియా సాయి వద్ద డ్యామ్‌ను నిర్మించడంతో ఇక్కడ నీటిసామర్థ్యం తగ్గిపోయింది. 135 క్యూసెక్కుల నీరు రావడం లేదు. 50క్యూసెక్కులు మాత్రమే వస్తోంది.
- పైడిగాం చానెల్ మరమ్మత్తుల కోసం 1999-2000లో రూ.1.35 కోట్లు మంజూరయ్యాయి. 2014-15లో రూ.9.75 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 3/2 నుంచి 6/2 వరకు గోడల నిర్మాణం, దిగువ భాగంలో కాంక్రీటు పనులు పూర్తి చేశారు. కాలువకు రెండు వైపుల గోడలు నిర్మించాల్సి ఉంది. పైడిగాం ప్రాజెక్టుని లడ్డగుడ్డి వద్ద 3/2 వద్ద నిర్మిస్తే చీకటి గెడ్డ, ఘాటీ గెడ్డ, కళింగదళ్‌నుంచి మిగులు నీరు ప్రాజెక్ట్‌లోకి చేరుతుంది. ఇప్పుడు కేవలం మహేంద్రతనయ నదికి చేరిన వరద నీరు మాత్రం వస్తోంది.

తితలీ దెబ్బతో అస్తవ్యస్తం..

తితలీ తుఫాన్ సమయంలో పైడిగాం ప్రాజెక్టు ప్రధాన చానెల్ కొట్టుకు పోయింది. అప్పటి నుంచీ ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకమవుతోంది. గతంలో కలెక్టర్ జె.నివాస్ పైడిగాం చానెల్‌ను పరిశీలించి.. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.20లక్షల నిధులు మంజూరు చేశారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టక పోవడంతో దిగువ ప్రాంతానికి నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో పూడిక పేరుకుపోయిందని పేర్కొన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా కొన్ని గ్రామాల్లో మాత్రమే పూడికతీత పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా నిధులు విదల్చకపోవడంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించాలని కోరుతున్నారు. సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

అపూర్వ స్వాగతం

- ఎమ్మెల్యేలు కూన రవి, మామిడి గోవిందరావుకు జన నీరాజనం

(ఆమదాలవలస/పాతపట్నం/ అరసవల్లి)

ఆమదాలవలస, పాతపట్నం ఎమ్మెల్యేలు కూన రవికుమార్, మామిడి గోవిందరావుకు పార్టీశ్రేణులు, అభిమానులు, జిల్లావాసులు అపూర్వ స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా వారిద్దరూ జిల్లాకు వేర్వేరుగా చేరుకున్నారు. డప్పుల వాయిద్యాలతో.. బాణసంచా పేలుళ్లతో సందడిగా.. అభిమానులు అడుగడుగునా నీరాజనం పలికారు. పైడిభీమవరం నుంచి శ్రీకాకుళం వరకు పెద్దఎత్తున కార్లు, బైక్ ర్యాలీలు నిర్వహించారు. శ్రీకాకుళం మీదుగా ఆమదాలవలసకు, పాతపట్నానికి వారు చేరుకున్నారు. అభిమానులు గజమాలలతో వారిని సత్కరించారు.


ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు గజమాలతో సత్కారం

నేడు విశాఖ-గుణుపూర్ రైలు రద్దు


పాతపట్నం, జూన్ 23: విశాఖ-గుణుపూర్ రైలు సోమవారం రద్దు కానుంది. విజయనగరం యార్డు పరిధిలో విజయనగరం-కోరుకొండ, పూండి-నౌపడ, పూండి- పలాస మధ్య రైల్వే అభివృద్ధి పనులు చేపడుతున్నందున పలు రైళ్లతో పాటు విశాఖ-గుణుపూర్ రైలును సోమవారం రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు గమనించాలని వారు కోరారు.

గురుకులాల్లో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నందిగాం/ పాతపట్నం, జూన్ 23: నందిగాం, పాతపట్నంల్లోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులాల్లో ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగ తుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ పి.దమయంతి, వి.అర్చన వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. నందిగాం గురుకులంలో ఆరో తరగతికి ఎస్సీలకు 41, బీసీలకు, ఓసీలకు ఒక్కొక్కటి చొప్పున, ఏడో తరగతికి ఎస్సీలకు 13, ఎస్టీ, బీసీ, ఓసీలకు ఒక్కొక్కటి చొప్పున, ఎనిమిదో తరగతికి ఎస్సీలకు 22, ఓసీలకు ఒకటి, తొమ్మిదో తరగతికి ఎస్సీలకు 24, ఎస్టీ, బీసీ, ఓసీలకు ఒక్కొక్కటి చొప్పున ఖాళీలున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 29న గురుకులాల్లో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. ఇతర వివరాలకు 8096613777 నెంబరులో సంప్రదించాలని పాతపట్నం గురుకుల పిన్సిపాల్ అర్చన సూచించారు.



పల్లెప్రగతిపై ఆశలు



- వైసీపీ పాలనలో పంచాయతీలు నిర్వీర్యం
- నిధులు లేక అభివృద్ధి పనులు శూన్యం
- ఉత్సవ విగ్రహాలుగా మారిన సర్పంచ్‌లు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రక్షాళన చేయాలని విజ్ఞప్తి

(టెక్కలి)

పల్లెలు.. ప్రగతికి పట్టుకొమ్మలు. అటువంటి పల్లెలున్న పంచాయతీలు వైసీపీ పాలనలో నిరాదరణకు గురయ్యాయి. సర్వాధికారాలతో పంచాయతీలను అభివృద్ధి చేయాల్సిన సర్పంచ్‌లను గత ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలు మాదిరిగా మార్చేసింది. వారి అధికారాలను కొల్లగొట్టి.. పంచాయతీలకు వచ్చే నిధులను సైతం పక్కదారి పట్టించింది. గత ఐదేళ్లు పంచాయతీల్లో అభివృద్ధి కనుమరుగైంది. అధికశాతం వైసీపీ మద్దతుదారులే సర్పంచ్‌లుగా గెలవగా.. వారు నోరు మెదపలేని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో సర్పంచ్‌ల్లో ఆశలు చిగురిస్తున్నాయి. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్.. పంచాయతీలను ప్రక్షాళన చేస్తారని.. అభివృద్ధి దిశగా తీర్చిదిద్దుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలో 910 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు జరగ్గా.. వైసీపీ మద్దతుదారులే అధికంగా సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. వారంతా వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీలను అభివృద్ధి చేయొచ్చని ఎన్నో కలలు కన్నారు. కానీ, అవన్నీ కలలుగానే మిగిలిపోయాయి. అభివృద్ధి మాట అటుంచితే.. కనీసం పారిశుధ్య నిర్వహణ కూడా సక్రమంగా చేపట్టలేని దుస్థితి నెలకొంది. వైసీపీ పాలనలో సర్పంచ్‌లు నిరాదరణకు గురయ్యారు. పంచాయతీలు నిర్వీర్యమైపోయాయి. కేవలం పంచాయతీలకు సాధారణ నిధులు మినహా.. మరే ఒక్క రూపాయి కూడా జమకాలేదు. వీధిదీపాల నిర్వహణ, కాలువల్లో పూడికలు తొలగింపు, పారిశుధ్య పనులు, పీడబ్ల్యూడీ స్కీమ్‌ల నిర్వహణ, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడడం, బోర్లు మరమ్మతులు, సర్పంచ్‌ల గౌరవ వేతనాలు చెల్లింపులు, ఇతరత్రా అన్ని ఖర్చులు గ్రామపంచాయతీ సాధారణ నిధుల నుంచే వాడుకోవాల్సి వచ్చింది. ఇసుక, మైన్స్, గ్రావెల్ వంటి వనరులున్న పంచాయతీలకు రావాల్సిన మినరల్‌ఫండ్స్ కూడా గత రెండేళ్లుగా అందని దుస్థితి నెలకొంది. ఇక కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసినా.. వాటిని గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు బకాయిలు, తాగునీటి పథకాల విద్యుత్ బకాయిలు అంటూ సీసీ చార్జీల కింద ఆ నిధులు జమ చేయించారు. దీంతో పంచాయతీల్లో ఖర్చు చేసేందుకు సర్పంచ్‌ల వద్ద చిల్లిగవ్వ కూడా లేని దుస్థితి నెలకొంది. నిధులు లేక కనీసం మురుగు కాలువలను కూడా శుభ్రం చేయలేని స్థితిలో సర్పంచ్‌లు ఉన్నారు.

సచివాలయాలతో.. తగ్గిన ప్రాధాన్యం

'పంచాయతీలే అభివృద్ధికి పట్టుకొమ్మలు. సచివాలయాలు వచ్చినా పంచాయతీల ప్రాధాన్యం పోనివ్వం. పంచాయతీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం' అని సచివాలయ వ్యవస్థ ప్రారంభం నాడు అప్పటి సీఎం జగన్ ప్రకటించారు. కాగా.. సచివాలయాలపై పంచాయతీ పర్యవేక్షణను వైసీపీ ప్రభుత్వం తొలగించింది. సంక్షేమ కార్యక్రమాల అమలు, పౌరసేవలు వంటి వాటి విషయంలో సర్పంచ్‌లకు కనీస సమాచారం లేదు. వలంటీర్ల వ్యవస్థపై సైతం సచివాలయాలదే పెత్తనం సాగేది. ఈ నేపథ్యంలో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వచ్చిన తర్వాత పంచాయతీల ప్రాధాన్యం నిర్వీర్యమైపోయిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ నిధులను సైతం వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపిస్తున్నారు. ఎన్నికై మూడేళ్లు పూర్తయినా.. నిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని పేర్కొంటున్నారు. తమ విధులకు కూడా ప్రాధాన్యం లేకుండా పోయిందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

- ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో పంచాయతీలకు పూర్వవైభవం వస్తుందని సర్పంచ్‌లు భావిస్తున్నారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్.. పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పంచాయతీలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిధుల సద్వినియోగంపై దృష్టి సారించి.. అభివృద్ధి పనులు సాగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దిక్సూచి DIKSUCHI

జేఎన్‌యూలో ఎమ్మెస్సీ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ)- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బయోటెక్నాలజీ, కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్-బయోటెక్నాలజీ(గ్యాట్-బీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: బయోటెక్నాలజీ స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 12, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, ఓబీసీలకు 8, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 3 సీట్లు కేటాయించారు.

● కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. వీటిలో జనరల్ అభ్యర్థులకు 6, ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, ఓబీసీలకు 4, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 2 సీట్లు నిర్దేశించారు.

అర్హత: ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ)లో ప్రవేశానికి ఫిజికల్, బయలాజికల్(బయోకెమిస్ట్రీ/బయోఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ/బోటనీ/మైక్రోబయాలజీ/జువాలజీ), అగ్రికల్చరల్, వెటర్నరీ అండ్ ఫిషరీ సైన్సెస్, ఫార్మసీ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ(ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సు) పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

● ఎమ్మెస్సీ(కంప్యూటేషనల్ అండ్ ఇంటిగ్రేటివ్ సైన్సెస్)లో ప్రవేశానికి బేసిక్ సైన్సెస్, అప్లయిడ్ సైన్సెస్ సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులు; బీఈ/బీటెక్/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

■ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27. ■ **వెబ్‌సైట్:** www.jnu.ac.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీకి ఇది అనుబంధ సంస్థ. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీఎస్ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 30
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 8
- **సెల్ఫ్ రిపోర్టింగ్‌కు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** జూలై 20
- **థర్డ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 5
- **ఓరియంటేషన్, రిజిస్ట్రేషన్:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

50వ జీ-7 సమావేశం



జీ-7 లేదా గ్రూప్ ఆఫ్ సెవెన్.. అనేది ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాల కూటమి. తొలుత ఆర్థిక, రాజకీయపరమైన అంశాల్లో పరస్పర సహకారానికి ప్రపంచ ధనిక దేశాకీ కూటమిని ఏర్పాటు చేసుకున్నా, కాలక్రమంలో ఈ కూటమి తన లక్ష్యాల పరిధిని పెంచుకుంటూ వస్తోంది. సభ్యదేశాలతోపాటు అవసరార్థం సభ్యేతర దేశాలతో కూడా జట్టుకడుతూ తమ వార్షిక సమావేశాలకు ఆహ్వానించి పరస్పర ప్రయోజన చర్చలకు వేదికవుతోంది. ఈ కోవలో 2003లో మొదలు ఇప్పటివరకూ భారత్ పదకొండుసార్లు ఈ సమావేశాల్లో ఆహ్వానిత దేశంగా పాల్గొంది. 2019 నుంచి వరుసగా ఆహ్వానాన్ని అందుకుంటూనే ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా ఉభయతారక ప్రయోజనాల కోసం భారత్ ఈ సమావేశాలకు హాజరవుతూ అభివృద్ధి చెందిన దేశాలైన జీ-7 దేశాల సమావేశ వేదికపై తన వాణిని వినిపిస్తూ ఉంది.

తాజాగా జీ-7, 50వ సమావేశం ఇటలీలోని అపూలియా రీజన్‌లో జూన్ 13 నుంచి 15 వరకూ జరిగిన నేపథ్యంలో ఆతిథ్య దేశంగా భారత్ 11వ సారి పాల్గొన్న సందర్భంగా జీ-7 పుట్టుపూర్వోత్తరాలు, ఆతిథ్య దేశంగా భారత్ పాత్ర, ప్రస్తుత సమావేశ ప్రధాన లక్ష్యాలు, చేసిన తీర్మానాలపరంగా ఒక విహంగవీక్షణం చేయాల్సిన అవసరం ఉంది.

జీ-7 ఆవిర్భావం-గమనం



1973 ప్రాంతంలో చమురు ఉత్పత్తి దేశాలు చమురు ఉత్పత్తిని ఉద్దేశపూర్వకంగా తగ్గించి, చమురు ధరలు పెరిగేలా చమురు సంక్షోభం(ఫస్ట్ ఆయిల్ క్రైసిస్) సృష్టించాయి. ఆ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి

ఆహ్వానిత దేశంగా భారత్

చెందిన దేశాలైన ఆరు దేశాలు(అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, వెస్ట్ జర్మనీ, జపాన్) ఒక కూటమిగా(జీ-6)గా 1975లో ఏర్పడ్డాయి. అనంతరం 1976లో కెనడా కూడా ఈ కూటమిలో చేరడంతో జీ-7గా రూపాంతరీకరణ జరిగింది. 1998లో రష్యా కూడా ఈ కూటమిలో చేరడంతో ఇది జీ-8గా రూపొందింది. కానీ, 2014లో రష్యా, క్రిమియాను ఆక్రమించడంతో రష్యా జీ-8 సభ్యత్వాన్ని రద్దుచేశారు. దాంతో జీ-8గా తాత్కాలికంగా మారిన ఈ కూటమి తిరిగి జీ-7గా స్థిరపడింది.

జీ-7 విధివిధానాలు, భాగస్వాములు, సమావేశాలు

ఈ జీ-7 కూటమి కేవలం ఒక స్వేచ్ఛాయుత, పరస్పర అంగీకార కూటమి. ఏ ఒప్పందం ద్వారానూ/చార్టర్ ద్వారానూ ఇది ఏర్పడలేదు. అదేవిధంగా సభ్యదేశాలను నియంత్రించే ఎలాంటి చట్టపర కట్టుబాట్లు, వ్యవస్థలు దీనికి లేవు. ఒక ప్రధాన కార్యాలయమంటూ ఏదీలేదు.

అయితే ప్రతి సంవత్సరం జీ-7 సమావేశాలు నిరవధికంగా జరుగుతాయి. దఫాలవారీగా ఒక్కొక్క సభ్యదేశం ఈ సమావేశాన్ని నిర్వహించే బాధ్యత ఒక్కో ఏడాది తీసుకుంటుంది. ఆ ఏడాది సమావేశ ఎజెండా కూడా ఆ ఆతిథ్య దేశమే నిర్ణయిస్తుంది. అదేవిధంగా సంవత్సరం పొడవునా వివిధ రాజకీయ, ఆర్థికపరమైన అవసరాలకు అనుగుణంగా మంత్రులు, అధికారుల స్థాయి సమావేశాలు కూడా జరుగుతూ ఉమ్మడి తీర్మానాలు ప్రకటిస్తుంటాయి.

ఈ జీ-7 సమావేశాల్లో ఏడు సభ్యదేశాలతోపాటు యురోపియన్ యూనియన్, వరల్డ్‌బ్యాంక్(ప్రపంచబ్యాంక్), అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్), ఐక్యరాజ్య సమితి కూడా పాల్గొంటాయి.

2003 నుంచి జీ-7 సమావేశాలకు సభ్యేతర దేశాలు కూడా ఆహ్వానిస్తున్నారు. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ప్రాంతాల నుంచి ఈ దేశాలను ఆహ్వానించి వివిధ సామాజిక, పర్యావరణ, వ్యాపార అంశాలపరంగా అంతర్జాతీయ సహకారాన్ని ప్రోదిచేయడానికి ఔట్‌రీచ్ సెషన్స్ నిర్వహిస్తారు. జీ-7 సమావేశాలకు సంబంధించిన చర్చనీయాంశాల రూపకల్పనలో, సమావేశానంతర సమీక్షల నిర్వహణల్లో 'షెర్పా'లని పిలిచే పలు దేశాల అధికార గణం(రాయబారులు మొదలైనవారు) కీలకపాత్ర వహిస్తుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)

ముఖ్యాంశాలు తీర్మానాలు

50వ జీ-7 సమావేశాన్ని సభ్యదేశమైన ఇటలీ జూన్ 13 నుంచి 15 వరకూ అపూలియా రీజియన్‌లో గల బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో నిర్వహించింది. 2003 నుంచి అనుసరిస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా సభ్యదేశాలతోపాటు సభ్యేతర దేశాలను కూడా జీ-7 సమావేశ ఔట్‌రీచ్ సెషన్స్‌కు ఆహ్వానించారు. ఆహ్వానం అందుకున్న సభ్యేతర దేశాల్లో భారత్‌తోపాటు అల్జీరియా, అర్జెంటీనా, బ్రెజిల్, జోర్డాన్, కెన్యా, మౌరిటేనియా, టునేషియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్ ఉన్నాయి. ఈ దేశాలతోపాటు ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచబ్యాంకు, ఆర్గనైజేషన్ ఆఫ్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్, ఐక్యరాజ్యసమితి అధిపతులు కూడా ఉన్నారు.

సమావేశ థీమ్, ఎజెండా

ఈ ఏడాది జీ-7 సమావేశపు థీమ్‌ను 'రూల్ బేస్డ్ ఇంటర్నేషనల్ సిస్టమ్'గా, సమావేశానికి ప్రత్యేక ఆహ్వానిత దేశాధ్యక్షుడైన టర్కీ అధ్యక్షుడు 'రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్' నిర్ణయించారు. ఆతిథ్యదేశంగా ఇటలీ ఈ సమావేశ ఎజెండాను రూపొందించింది. ఎజెండాలో 'ఉక్రెయిన్, గాజాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితులు', 'ఆఫ్రికా, మధ్యధరా ప్రాంత పరిస్థితులు', 'వలసలు', 'ఆర్థిక భద్రత', 'కృత్రిమమేథ' విషయంలో అంతర్జాతీయ సహకారంవంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి.

సమ్మిట్ ముఖ్య నిర్ణయాలు

- జీ-7 సభ్య దేశాలు దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ సమావేశం నేపథ్యంలో ఉక్రెయిన్‌తో అమెరికా పదేళ్ల సమయానికి గానూ ఒక భద్రతా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సంపత్తిని అందించనుంది. ఇదేతరహా భద్రతా ఒప్పందం జపాన్ కూడా ఉక్రెయిన్‌తో కుదుర్చుకోవడం ఈ సదస్సు నేపథ్యంగానే జరిగింది.
- అమెరికా, యూరప్‌ల్లో స్తంభింపజేసిన రష్యా ఆస్తులను హామీగా పెట్టుకుని ఉక్రెయిన్‌కు 50 బిలియన్ డాలర్ల రుణాన్ని జీ-7 దేశాలు అందించాయి. ఇకముందు కూడా దఫాలవారీగా ఇలాంటి రుణాలను ఉక్రెయిన్‌కు అందించేందుకు జీ-7 సభ్యదేశాలు నిర్ణయించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్నందుకు గానూ రష్యా నష్టపరిహారం చెల్లించేంత వరకు ఇది కొనసాగించాలని నిర్ణయించాయి.
- ఆహార భద్రతకు, పోషకాహారానికి గల వ్యవస్థాగత అడ్డంకులను అధిగమించేందుకు కృషిచేయడానికి 'అపూలియా ఫుడ్ సిస్టమ్స్ ఇనిషియేటివ్'ను ప్రకటించారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థికంగా సహకరించేందుకు జీ-7 దేశాలు ఆరంభించిన 'పార్టనర్‌షిప్ ఫర్ గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్' ద్వారా 2027 నాటికి 600 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించడానికి నిర్ణయించారు.
- కృత్రిమమేథ రంగంలో పరిశోధనలు చేస్తూ అడ్వాన్స్‌డ్ ఏఐ సిస్టమ్స్‌ను రూపొందిస్తున్న సంస్థలను కట్టడి చేసేందుకు అంతర్జాతీయ కోడ్ ఆఫ్ కండక్ట్(ప్రవర్తనా నియమావళిని) రూపొందించడానికి అంగీకరించారు. కృత్రిమమేథ సృష్టించే సమస్యలను ఎదుర్కొంటూ, అది అందించే ప్రయోజనాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
- అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా అవలంబిస్తున్న దమన నీతిని అడ్డుకుని మార్కెట్ ఒడుదొడుకులు, వక్రీకరణల నుంచి పరిశ్రమలను, కార్మికులను, పెట్టుబడులను, ఆర్థికభద్రతను పరిరక్షించుకునేందుకు జీ-7 దేశాలు చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు.
- వలసలు సంధించే సమస్యలు, అందించే అవకాశాలపరంగా వలస విధానాలపై ఒక సంయుక్త విధాన రూపకల్పనకు 'లాస్‌ఏంజెల్స్ డిక్లరేషన్ ఆన్ మైగ్రేషన్ అండ్ ప్రొటెక్షన్' మార్గనిర్దేశంలో కృషిచేయాలని పిలుపునిచ్చారు.
- అభివృద్ధి చెందుతున్న దేశాలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోభివృద్ధి సాధించేందుకు అభివృద్ధి చెందిన దేశాల భాగస్వామ్యం, సహకారం పెంపునకు పిలుపునిచ్చాయి. అదేవిధంగా పరిశుద్ధ ఇంధన వనరుల వినియోగం దిశగా తరలడం ద్వారా వాతావరణ మార్పులను, కాలుష్యాన్ని, జీవవైవిధ్య నష్టాన్ని ఎదుర్కొనేందుకు పిలుపునిచ్చాయి.
- లైంగిక ఆరోగ్యం, పునరుత్పాదక అంశాలు, లింగ అసమానతలకు సంబంధించి సమాన హక్కులు ఉండేలా చర్యల కోసమై పిలుపునిచ్చాయి.
- అంతర్జాతీయ శాంతి భద్రతలను పెంపొందించేందుకు గాజాలో కాల్పుల విరమణను ఆశించడంతోపాటు 'తగిన సమయంలో' పాలస్తీనాను దేశంగా గుర్తించడంతో సహా రెండు దేశాల పరిష్కారానికి జీ-7 కట్టుబడిందని మరోసారి నొక్కిచెప్పారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

'పుష్పక్' హ్యాట్రిక్

(మొదటి పేజీ తరువాయి)

మూడో పరీక్ష ఎల్ఈఎక్స్-03ను కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి ఆదివారం ఉదయం 7.10 గంటలకు నిర్వహించినట్టు ఇస్రో ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. గతంలో నిర్వహించిన ఎల్ఈఎక్స్-01, ఎల్ఈఎక్స్-02 విజయవంతమైన నేపథ్యంలో ఈసారి మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్లు, తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించినట్టు పేర్కొంది. ప్రయోగంలో భాగంగా పుష్పక్‌ను భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా రన్‌వేకు 4.5 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. అక్కడి నుంచి పుష్పక్ స్వయంగా క్రాస్ రేంజ్ కరెక్షన్ విన్యాసాలను చేపడుతూ.. రన్‌వేపైకి చేరుకుని నిర్దేశిత సెంటర్‌లైన్ వద్ద ల్యాండ్ అయింది. ఈ వాహనానికి సంబంధించిన తక్కువ లిఫ్ట్-టు-డ్రాగ్ నిష్పత్తి ఏరోడైనమిక్ కాన్ఫిగరేషన్ కారణంగా ల్యాండింగ్ వేగం గంటకు 320 కి.మీ. కంటే ఎక్కువగా ఉందని, కమర్షియల్ విమానాల్లో ఇది గంటకు 260 కి.మీ., సాధారణ యుద్ధ విమానానికి గంటకు 280 కి.మీ. ఉంటుందని ఇస్రో తెలిపింది. పుష్పక్ రన్‌వేపై ల్యాండయిన తర్వాత బ్రేక్ పారాచూట్ సాయంతో దాని వేగాన్ని గంటకు 100 కి.మీ.కు తగ్గించామని, ఆ తర్వాత ల్యాండింగ్ గేర్ బ్రేక్‌లను ఉపయోగించి దాన్ని రన్‌వేపై నిలిపివేశామని పేర్కొంది. అంతరిక్షం నుంచి తిరిగొచ్చే సమయంలో ఆర్ఎల్‌వీ విధానం ఎలా ఉంటుంది, హైస్పీడ్ ల్యాండింగ్‌ను అది ఎలా నియంత్రించగలుగుతుంది వంటి పరిస్థితులను ఈ మిషన్ విజయవంతంగా ప్రదర్శించిందని ఇస్రో వివరించింది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) నేతృత్వంలో సాగిన ఈ మిషన్‌ను ఇస్రో కేంద్రాలైన స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ), ఇస్రో టెలిమెట్రి, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్), శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌ల నుంచి శాస్త్రవేత్తలు పర్యవేక్షించారు. ఎంతో సంక్లిష్టమైన ఈ పరీక్షను విజయవంతం చేసిన బృందాన్ని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అభినందించారు.

హోమో సెక్స్ కేసులో సూరజ్ రేవణ్ణ అరెస్టు

బెంగళూరు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి మరో షాక్ తగిలింది. ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ హోమోసెక్స్ కేసులో అరెస్టయ్యారు. అసహజ లైంగిక దౌర్జన్యం వివాదంలో సాక్ష్యాలను పోలీసులకు వివరించేందుకు వెళ్లిన ఎమ్మెల్సీ సూరజ్‌ను హాసనరసీపుర పోలీసులు శనివారం రాత్రంతా విచారించారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు సూరజ్ రేవణ్ణను అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు. సూరజ్‌పై ఐపీసీ 377 (అసహజ లైంగిక దౌర్జన్యం), 342, 506, సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనపై సూరజ్‌రేవణ్ణ లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డారని జేడీఎస్ పార్టీకి చెందిన కార్యకర్త ఒకరు ఆరోపించారు. ఈ ఆరోపణలను సూరజ్‌రేవణ్ణ ఖండించారు. తననుంచి రూ.5కోట్లు పొందాలని చేతన్ అనే వ్యక్తి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలావివాదం సాగుతుండగానే.. తనను చేతన్ బ్లాక్‌మెయిల్ చేసినట్టు సాక్ష్యాలున్నాయంటూ శనివారం రాత్రి సూరజ్‌రేవణ్ణ హాసనరసీపుర గ్రామీణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అయితే, చేతన్ అంతకుముందే డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు సూరజ్‌ను తెల్లవారుజామున 4 గంటలదాకా విచారణ జరిపారు. తర్వాత అరెస్టు చేశారు. మరోవైపు బాధితుడిని బెంగళూరులోని బౌరింగ్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

లోకం తీరు



నేటి నుంచి లోక్‌సభ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకారం చేస్తారు. ఒక్కో ఎంపీ ప్రమాణానికి ఒక నిమిషం సమయం ఉంటుంది. ప్రధాని మోదీ క్యాబినెట్‌లోని మంత్రుల్లో 58 మంది లోక్‌సభ సభ్యులు, 13 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు లూధియానా నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ఏ సభలోనూ సభ్యుడు కాకపోవడం గమనార్హం. లోక్‌సభ సమావేశాలు జూలై 3 వరకు కొనసాగనున్నాయి. కాగా, లోక్‌సభలో తొలి రోజే ఏపీకి చెందిన 25 మంది సభ్యులు ప్రమాణం చేయనుండగా, రెండో రోజు తెలంగాణకు చెందిన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తారు. మూడో రోజైన 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఉంటుంది. రాజ్యాంగంలోని 93వ ఆర్టికల్ ప్రకారం లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా లోక్‌సభ స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవంగానే జరుగుతూ వస్తోంది. సహజంగా అధికార పక్షానికి చెందిన ఎంపీకి స్పీకర్ పదవి, ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ప్రతిపక్షాలకు ఇచ్చే ఉపసభాపతి పదవిని తమకు ఇవ్వాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. 17వ లోక్‌సభలో బీజేపీకి చెందిన ఓంబిర్లా స్పీకర్‌గా ఉన్నారు. ఉపసభాపతి స్థానానికి ఎవరినీ ఎంపిక చేయకపోవడం వల్ల ఆ పదవి ఐదేళ్లు ఖాళీగా ఉంది. ఈ సారి ఉపసభాపతిని ఇండియా కూటమికి ఇస్తుందా? లేదా ఎన్డీయే మిత్రపక్షాల్లో ఎవరికైనా అప్పగిస్తుందా? అన్నది వేచిచూడాల్సిందే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 27న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆమె ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ 2న లోక్‌సభలో, 3న రాజ్యసభలో ప్రసంగిస్తారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌తోపాటు సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, సంజయ్, శ్రీనివాస వర్మలు తొలిరోజే ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

అవహేళనలకు గురైనవేళమీ ఆదరణే రక్షించింది

▸▸ వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగ లేఖ

వయనాడ్, జూన్ 23: కేరళలోని వయనాడ్ నియోజకవర్గానికి రాజీనామా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం అక్కడి ప్రజలకు భావోద్వేగపూరిత లేఖ రాశారు. వయనాడ్, రాయ్‌బరేలీ రెండు చోట్ల నుంచి లోక్‌సభకు ఎన్నికవడంతో ఆయన ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. వంశపారంపర్య స్థానంగా గుర్తింపు పొందిన ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకొని వయనాడ్‌ను విడిచిపెట్టారు. ఇక్కడ ఆయన సోదరి ప్రియాంక గాంధీ పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వయనాడ్ ప్రజలకు లేఖ రాశారు. 'ప్రతి రోజూ అవహేళనలకు గురైన సమయంలో మీరు చూపించిన అపరమిత ప్రేమే నన్ను కాపాడింది' అని ఆ లేఖలో ప్రధానంగా పేర్కొన్నారు. "వయనాడ్‌ను వదులుకోవాలన్న నిర్ణయాన్ని ప్రకటించేందుకు మీడియా ముందుకు వచ్చినప్పుడు నా కళ్లలోని విచారాన్ని మీరు చూసే ఉంటారు. అయిదేళ్ల క్రితం ఓ పరాయివ్యక్తిగా మీ ముందుకు వచ్చాను. అయినా మీరు నన్ను నమ్మారు. హద్దులు లేని ప్రేమ, అభిమానంతో అక్కున చేర్చుకున్నారు. ప్రతి రోజూ దుర్భాషలకు గురయిన సమయంలో మీరు చూపిన షరతుల్లేని ప్రేమే నన్ను సంరక్షించింది. మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్థం కావడం లేదు. మీరు నా కుటుంబంలో సభ్యులు" అని పేర్కొన్నారు.

సగం మందే హాజరు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించగా.. చండీగఢ్ కేంద్రంలో పరీక్ష రాయాల్సిన ఇద్దరూ హాజరు కాలేదు. ఛత్తీసగఢ్‌లో రెండు కేంద్రాల్లో 602 మంది పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేయగా.. కేవలం 291 మందే వచ్చారు. హరియాణాలో రెండు కేంద్రాల్లో 494 మందికి ఏర్పాట్లు చేయగా.. 287 మంది, మేఘాలయలో 464 మందికిగాను 234 మంది మాత్రమే పరీక్ష రాశారు. గుజరాత్‌లో ఒకే ఒక్క అభ్యర్థి కోసం పరీక్ష పెట్టారు. మరోవైపు.. నీట్ కేసు దర్యాప్తున చేపట్టిన సీబీఐ.. ఆదివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు.. నీట్-యూజీ 2024 పరీక్ష నిర్వహణలో కొన్ని రాష్ట్రాల్లో అవకతవకలు చోటుచేసుకున్నట్టు పేర్కొంటూ గుర్తు తెలియని వ్యక్తులపై ఐపీసీ సెక్షన్ 120-బి (నేరపూరిత కుట్ర), సెక్షన్ 420 (చీటింగ్) కింద కేసులు నమోదు చేసింది. ఇక.. నీట్, యూజీసీ నెట్ ప్రశ్న పత్రాలు లీక్ అయిన నేపథ్యంలో.. ఆ రెండింటితోపాటు జేఈఈ మెయిన్, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ సహా పలు ప్రవేశ, పోటీ పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ వెబ్‌సైట్ హ్యాక్ అయ్యిందన్న వదంతులు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఎన్‌టీఏ అప్రమత్తమై.. అలాంటిదేమీ లేదని, ఎన్‌టీఏ, దాని అనుబంధ వెబ్‌సైట్లన్నీ అత్యంత భద్రంగా ఉన్నాయని ప్రకటించింది. మరోవైపు.. పరీక్షల సంస్కరణలపై ఇస్రో మాజీ చీఫ్ రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్రం నియమించిన ఏడుగురు సభ్యుల ప్యానెల్ సోమవారం సమావేశం కానుంది.



సీబీఐ అధికారుల కారుకు అడ్డుపడిన కసియాడిహ్ గ్రామస్థులు

ఆ నలుగురికే కాదు..

నీట్ పేపర్ లీక్ కేసులో బిహార్ పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు కీలక నిందితులు తెలిపిన వివరాల ప్రకారం.. నలుగురికి కాదు.. మొత్తం 25 నుంచి 30 మంది విద్యార్థులకు ప్రశ్నపత్రాన్ని అమ్మారు. ఒక్కొక్కరికీ రూ.30 నుంచి రూ.40 లక్షలకు విక్రయించినట్టు.. సికందర్ యాదవేందు, అఖిలేశ్ కుమార్, బిట్టు కుమార్ , సంజీవ్ సింగ్, రాకీ, నితీశ్, అమిత్ ఆనంద్ తదితర నిందితులు తమ నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. మే 4వ తేదీ రాత్రి బిహార్‌లోని సాల్వర్ గ్యాంగు మునిసిపల్ జూనియర్ ఇంజనీర్ సికందర్ యాదవేందు ద్వారా నలుగురు విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాన్ని జవాబులతో సహా అందజేసే సమయంలోనే పట్నా పోలీసులకు ఝార్ఖండ్ పోలీసుల నుంచి ఈ వ్యవహారంపై ఉప్పందింది. ఈ వ్యవహారంలో మొత్తం 13 మంది నిందితుల నేరాంగీకార వాంగ్మూలాలను మే 5వ తేదీనే నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. కాగా.. కేంద్రానికి బిహార్ ఈవోయు పంపిన ఆరు పేజీల నివేదిక ఆధారంగా ఎన్‌టీఏ మరో 17 మంది విద్యార్థులను డిబార్ చేసింది. దీంతో ఈ ఏడాది నీట్ రాసినవారిలో 110 మందిని డిబార్ చేసినట్టయింది.

సీబీఐ బృందంపై దాడి

యూజీసీ-నెట్ కేసు దర్యాప్తులో భాగంగా.. ఫూల్ చంద్ అనే వ్యక్తి సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేస్తూ బిహార్‌లోని నవాదా ప్రాంతానికి వెళ్లిన సీబీఐ బృందంపై కసియాడిహ్ గ్రామస్థులు దాడి చేశారు. సీబీఐ బృందంలో నలుగురు అధికారులు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు. గ్రామస్థులు వారిపై దాడి చేయగా.. సీబీఐ బృందం స్థానిక పోలీసులకు ఫోన్ చేయగా వచ్చి కాపాడారు. అనంతరం స్థానిక పోలీసుల సమక్షంలో దర్యాప్తు కొనసాగించిన సీబీఐ బృందం రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. కాగా.. తమ గ్రామానికి వచ్చింది నకిలీ అధికారుల బృందం అనే సందేహంతోనే గ్రామస్థులు సీబీఐ అధికారులపై దాడి చేసినట్టు స్థానిక పోలీసులు చెప్పారు.

అలాగే.. ఈ కేసులో బిహార్ ఈవోయు యూనిట్ మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి దాకా బిహార్‌లో అరెస్టయినవారి సంఖ్య 18కి చేరింది. మహారాష్ట్రలోనూ నాందేడ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఇద్దరు టీచర్లను అదుపులోకి తీసుకుని విచారించారు.

నీట్ స్కామ్‌కు మోదీ సర్కారుదే బాధ్యత: ఖర్గే

న్యూఢిల్లీ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): 'నీట్ కుంభకోణాని'కి మోదీ ప్రభుత్వానిదే బాధ్యత అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. బీజేపీ వల్ల కుళ్లిపోయిన విద్యా వ్యవస్థ.. అధికారులను మార్చినంత మాత్రాన బాగుపడదని శనివారం 'ఎక్స్' పోస్టులో వ్యాఖ్యానించారు. ఇప్పుడు నీట్-పీజీని వాయిదా వేశారని, గత పది రోజుల్లో నాలుగు పరీక్షలను వాయిదా వేయడమో, రద్దు చేయడమో చేశారని గుర్తుచేశారు. విద్యా వ్యవస్థలోకి ప్రశ్నపత్రాల లీక్‌లు, అవినీతి, అక్రమాలు, మాఫియా చొరబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్ రాకెట్, మాఫియా ముందు ప్రధాని మోదీ నిస్సహాయంగా మారారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. నీట్-పీజీ వాయిదా పడడం మోదీ హయాంలో ధ్వంసమైన విద్యా వ్యవస్థకు మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థను, పిల్లల భవిష్యత్తును మాఫియా, అవినీతిపరులు, భజనపరులైన అసమర్థుల చేతుల్లో పెట్టిందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఒక్క పరీక్షను కూడా సక్రమంగా పారదర్శకంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. యువత భవిష్యత్తుకు బీజేపీయే అతిపెద్ద అడ్డంకిగా మారిందన్నారు.

2038 జూలై 6న గ్రహశకలం
భూమిని ఢీకొట్టే ముప్పు

న్యూఢిల్లీ, జూన్ 23: పద్నాలుగేళ్ల తర్వాత 2038వ సంవత్సరం జూలై 12వ తేదీన ఓ గ్రహశకలం భూమిని ఢీకొట్టే ముప్పు ఎక్కువగా(72%) ఉందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది. ఈ గ్రహశకలం పరిమాణం, వేగం, దాని వల్ల కలిగే అనర్థాలపై ఇప్పుడే అంచనాకు రాలేమని తెలిపింది. అయితే, దాన్ని దారి మళ్లించే సాంకేతిక అందుబాటులో ఉన్నప్పటికీ, ఈ గ్రహశకలానికి సంబంధించి ఇంకా ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదని వివరించింది. గ్రహశకలం కదలికలను గమనిస్తున్నామని తెలిపింది. జూన్ 20న మేరీలాండ్‌లోని జాన్స్ హాప్కిన్స్ అప్లైడ్ ఫిజిక్స్ ల్యాబ్(ఏపీఎల్)లో నిర్వహించిన పరిశోధనల్లో ఈ గ్రహశకలం కదలికలను గుర్తించారు. తాజాగా ఓ నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రహశకలాలు భూమి వైపునకు దూసుకువస్తున్నాయన్న అంతరిక్ష పరిశోధన సంస్థల ప్రకటన లు సాధారణమే అయినప్పటికీ ఈసారి నాసా తేదీతో సహా హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకొంది.

మేనల్లుడే వారసుడు: మాయావతి



లఖ్‌నవూ, జూన్ 23: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను మరోసారి తన రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆయనకు పార్టీ జాతీయ సమన్వయకర్తగా తిరిగి బాధ్యతలు అప్పగిస్తూ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. గతనెలలో ఎన్నికల సమయంలో ఆకాశ్‌కు పరిపక్వత లేదని పేర్కొంటూ ఆయనను వారసుడిగా తొలగించడంతోపాటు పార్టీ బాధ్యతల నుంచి తప్పించారు. "ఆకాశ్ పూర్తి పరిణతి కలిగిన నేత ఎదుగుతారని ఆశిస్తున్నా. భవిష్యత్తులో అతను నా అంచనాలను అందుకోగలరు" అని తాజాగా మాయావతి పేర్కొన్నారు.

కళింగ కోమట్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా 'బోయిన'

టెక్కలి, జూన్ 23: కళింగ కోమట్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా బోయిన గోవిందరాజులు ఎన్నికయ్యారు. శ్రీకాకుళం కళింగ వైశ్య భవనంలో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల కళింగ కోమట్లు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. ఆయన మాట్లా డుతూ.. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కళింగ కోమట్ల కులాన్ని బీసీల జాబితాలో చేర్పించుకున్నామని, ఓబీసీ సాధిం చేవరకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గోవిందరాజులు రాష్ట్ర కళింగ కోమట్ల సంఘ అధ్యక్షుడిగా ఎన్నికవడం పట్ల కోటబొమ్మాళి మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళాసు కృష్ణారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కోరాడ గోవిందరావు, నేతలు హరిగోపాల్, వీవీ రమణ, కోరాడ రమేష్, టెక్కలి వైశ్య సంఘం నాయకులు లాడి శ్రీనివాస్, కోరాడ రాంప్రసాద్, జామి వెంకటరమణ, పెద్దబాబు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

'బోయిన'కు పలాస జీడి వ్యాపారుల సత్కారం

పలాస: కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ టీడీపీ నేత బోయిన గోవింద రాజులను పారిశ్రామికవాడ జీడి పరిశ్రమల యాజమాన్య సంఘ నేతలు అభినందించారు. శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరావు, పీసీఎంఏ మాజీ అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావుతో పాటు పలువురు నేతలు కలిసి సత్కరించారు.


గోవిందరాజులును సత్కరిస్తున్న పలాస జీడి వ్యాపార సంఘ నేతలు

గోవిందరాజులు ఎన్నికపై హర్షం

పాతపట్నం: కళింగ కోమట్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా బోయిన గోవిందరావు ఎన్నికపై మండల కళింగవైశ్యసంఘ అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం శ్రీకాకుళంలో ఆయనను కలిసి అభినందించారు. కార్యక్రమంలో శాసనపురి మధుబాబు, బోయిన చంద్రమౌళి, కోట్ని తేజ, తరుణ్, దుంప షణ్ముఖరావు, బి.రాజు తదితరులు కలిసి అభినందించారు.

ఎమ్మెల్యే గోవిందరావుకు ఘన స్వాగతం

పాతపట్నం/ఎల్.ఎన్.పేట: పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తరువాత నియోజకవర్గ కేంద్రానికి తొలిసారి వచ్చిన సందర్భంగా రణస్థలం మండలం పైడి భీమవరం వద్ద ఘన స్వాగతం లభించింది. ప్రత్యేక వాహనంపై గోవిందరావు ఉమ్మడి పార్టీల శ్రేణుల ఆనందోత్సాహాల నడుమ నియోజకవర్గ కేంద్రానికి పయనమయ్యారు. ఈ సందర్భంగా ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ క్యాడర్ తరలివెళ్లింది. పార్టీ ఎల్ఎన్‌పేట మండల నాయకులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, ఎం.మనోహర్‌నాయుడు, వి.ఆనందరావు, బి.వెంకటేశ్వరరావు తదితరులు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. బొత్తాడసింగి మాజీ సర్పంచ్ అంపిలి సీతమ్మ, నాయకుడు అంపిలి పోలినాయుడు గజమాలతో సత్కరించారు. పాతపట్నంలోని వివిధ కూడళ్లలో ఆయనకు నేతలు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు.


ఎమ్మెల్యే గోవిందరావుకు గజమాలతో సత్కరిస్తున్న నేతలు

చెత్త నుంచి సంపద సృష్టించాలి


చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో రమణ

హరిపురం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించి సంపద సృష్టించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొంకడాపుట్టిలో ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను పారిశుధ్య కార్మికులకు అందిస్తే డంపింగ్ కేంద్రాలకు తరలించి తద్వారా ఎరువులను తయారీకి ఉపయోగిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘుపతిరావు, కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నందిగాం: పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని వండిపెడుతున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి కోరారు. ఆదివారం నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో ఎండీఎం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 23 ఏళ్లుగా వంటలు వండి పెడుతున్నారని, రాజకీయ అజమాయిషీ లేకుండా చూడాలని, కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని, ప్రతినెలా 5వ తేదీలోగా వేతనాలు, బిల్లులు చెల్లించాలని కోరారు. గ్యాస్ సరఫరాను ప్రభుత్వమే అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండలశాఖ ప్రతినిధులు వి.చిన్నమ్మడు, ఎ.పద్మావతి, కె.మల్లేశ్వరి, టి.బృందావతి, బి.బాలామణి, ఎ.పండా తదితరులున్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎండీఎం కార్మికులు

అచ్చెన్నను కలిసిన కొండల ప్రాంత నేతలు


మంత్రి అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న కొండల ప్రాంత నేతలు

నందిగాం: రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కొండల ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఆయన స్వగృహంలో కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కల్లాడ, అన్నాపురం, హర్షబాడ పంచాయతీల్లో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ నందిగాం తిరుపతిరావు, నాయకులు బార్నాన తిరుపతి రావు, నందిగాం గోపాలకృష్ణ, ఆదినారాయణ, ఐటీడీపీ కన్వీనర్ బి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యవరం గ్రామానికి ట్యాంకర్‌తో నీటి సరఫరా

నరసన్నపేట: సత్యవరం గ్రామానికి ఆదివారం పంచాయతీ అధికారులు ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా చేశారు. గత 3 నెలల నుంచి తాగునీరు లేక గ్రామస్థులు అవస్థలు పడ్డారు. తాగునీటి సరఫరా చేయాలని ప్రజలు అనేక పర్యాయాలు అధికారులకు మొర పెట్టుకున్నా వినిపించుకునే నాథుడు కరువయ్యాడు. తాగునీటి ఇబ్బందులున్నాయని, బంధువులెవరూ గ్రామానికి రావొద్దని చెప్పుకోవాల్సిన పరిస్థితి ఎదురైందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మారి టీడీపీ అధికారంలోకి రావడంతో స్పందించిన అధికారులు ట్యాంకర్‌తో తాత్కాలికంగా నీటిని అందించారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు. ప్రతిరోజూ ఇలాగే సరఫరా చేయాలని, శాశ్వతంగా సమస్యను పరిష్కరిం చాలని వారు కోరుతున్నారు.


సత్యవరంలో ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

దారుణంగా గ్రామీణ రహదారులు

- డివిజన్ కేంద్రం పాలకొండకు నిలిచిన ఆర్టీసీ సేవలు
- చెరువులను తలపిస్తున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

(పాతపట్నం)

మండలంలోని పలు గ్రామీణ ప్రాంత రహదారులు దారుణంగా ఉన్నాయి. రోడ్లపై గోతులు ఏర్పడి ఏమాత్రం వర్షం కురిసినా నీరు చేరి రోజుల తరబడి ప్రజలు రాకపోకలకు నరకాన్ని అనుభవిస్తున్నారు. రాత్రి సమయాల్లో అయితే ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వైసీపీ ఐదేళ్ల హయాంలో ఒక్క రోడ్డు కూడా కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. ప్రధా నంగా కిమిడి-పర్లాకిమిడి మార్గం అత్యంత దారుణంగా ఉంది. రోడ్డంతా గోతుల మయమై వర్షపు నీరు చేరి కుంటలుగా తయారయ్యాయి. పర్లాకిమిడి నుంచి బైదలాపురం మీదుగా రుగుడ వెళ్లే ఈ రోడ్డు సుమారు 18 కిలో మీటర్లు ఉండే ఈ మార్గం ఆర్ఎల్‌పురం, ఏఎస్ కవిటి, సోద, బైదలాపురం తదితర పంచాయతీ ప్రజల రాకపోకలకు ఉపయోగపడేది. ఈ మార్గం గుండా పార్వతీపురం మన్యం జిల్లా డివిజన్ కేంద్రమైన పాలకొండ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులు ఉండేవి. వైసీపీప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. బీటీ రోడ్డుపై తారును తొలగించారు. ఆ తరువాత సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో పనులు అర్థంతరంగా నిలిచి పోయాయి. దీంతో రోడ్డు దారుణం గా తయారు కావడంతో తాము సర్వీసులను నడపలేమని ఆర్టీసీ అధికారులు చేతులెత్తేశారు. వాహనదారులు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే హడలెత్తుతున్నారంటే ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే పలు ఇతర గ్రామాల రోడ్లు కూడా దారుణంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను పునర్నిర్మించి ప్రమాదాలను నివారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గోతుల్లో నీరు చేరి దారుణంగా ఉన్న రుగడ రోడ్డు

15 గ్రామాల ప్రజలు అవస్థలు..

జలుమూరు: అబ్బాయిపేట కూడలి నుంచి తలతరియా, సంతలబైలి, ఎర్రన్నపేట గ్రామాలకు పోయే రహదారి గోతులమయమై ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి గుండా 15 గ్రామాల ప్రజానీకం రాకపోకలు సాగిస్తున్నారు. అయినప్పటికీ బాగుచేయించే నాథుడు కరువయ్యాడు. జలుమూరు నుంచి సుబ్రమణ్యపురం మీదుగా బుడితికి వెళ్లే రోడ్డు రాళ్లు తేలి నరకాన్ని తలపిస్తోంది. ఈ రహదారి గుండా 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గత టీడీపీ హయాంలో సుమారు 70 శాతం పనులు పూర్తవగా ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో రాళ్లు తేలి బాటసారులు నడిచేందుకు కూడా వీలు లేకుండా నరక యాతన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


తలతరియా రోడ్డుపై గోతుల్లో చేరిన నీరు

రైతులు కోరే విత్తనాలు, ఎరువులు అందించాలి

- ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాసరూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు కోరే విత్తనాలు, ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి చేనుకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలుగ జేయవద్దన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లుగా వంశధార కాలువల్లో ఎటువంటి పనులు చేపట్టలేదని, దీంతో రైతులు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రక్షిత తాగునీటి పథకాలపై రోడ్లను తవ్వి పైపులు వేశారని, అవి ఎంతమేర పని చేస్తున్నాయో పరిశీలించాల్సి ఉందన్నారు. వివిధ శాఖల్లో జరిగిన పనులపై పూర్తి స్థాయి సమాచారం అందిస్తే ఎంతవరకు న్యాయం జరుగుతుందో పరిశీలిస్తామన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులే ప్రభుత్వం నిర్వహించే పనుల్లో జోక్యం చేసుకుని వారి విధుల ను నిర్వహించాలన్నారు. మండల సమావేశానికి రెవెన్యూ శాఖతో పాటు మరికొన్ని శాఖల అధికారులు హాజరుకాలేదని, దీనిపై వారి వివరణ తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సమావేశానికి ఎంపీపీ ప్రవీణ అధ్యక్షత వహించగా ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు, వైస్ ఎంపీపీ టి.రాములు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు మండల ప్రజాప్రతినిధులు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే గౌతు శిరీషను సత్కరించి అభినందించారు.


ఎమ్మెల్యే శిరీషను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రాథమిక పాఠశాలలను ఆదుకోండి

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ

హరిపురం: వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను ఆదుకోవాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. హరిపురం హైస్కూల్ ఆవరణలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలకు పూర్వ కళ వచ్చేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని, ఉపాధ్యా యులపై యాప్‌ల భారం తగ్గించి పాఠాల బోధనకు సమయం వెచ్చించేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. సమస్యలను విద్యాశాఖామంత్రి దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సుకు రాష్ట్ర కార్యదర్శి కె.భానుమూర్తి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మదన్‌మోహన్, ఎస్‌వీ అనిల్‌కుమార్, ప్రతినిధులు జి.భీమారావు, శ్రీనివాస్, ఢిల్లేశ్వరరావు, గోపీకృష్ణ, వీవీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

శివారు భూములకు సాగునీరందించేందుకు చర్యలు

జలుమూరు: వంశధార కాలువల ద్వారా శివారు భూములకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వంశధార డీఈ బగ్గు సత్యనారాయణ తెలిపారు. బొడ్డపాడు సమీపంలో 18ఆర్ కాలువపై ఉన్న అక్విడెక్ట్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18 ఆర్ కాలువపై బొడ్డపాడు, కత్తిరివానిపేట మధ్య నిర్మించిన అక్విడెక్ట్ మరమ్మతులకు గురైనందున శివారు ప్రాంతాలైన తిమడాం, మాకివలస తదితర ప్రాంతాలకు సాగునీరందడం లేదన్నారు. అక్విడెక్ట్ గోడకు రంధ్రం పడడంతో నీరు బయటకు పోతోందన్నారు. ఈ ఏడాది దీనికి మరమ్మతులు చేపడుతున్నామన్నారు. అయితే ఇప్పటికే వర్షాలు ప్రారంభమైనందున అక్విడెక్ట్ వద్దకు మెటీరియల్ వెళ్లే అవకాశం లేదని, అక్విడెక్ట్ వద్దకు మెటీరియల్ వెళ్లే విధంగా రైతులు చర్యలు తీసుకుని పనులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జలుమూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వెలమల చంద్రభూషణరావు, వంశధార సిబ్బంది పాల్గొన్నారు.


బొడ్డపాడు వద్ద అక్విడెక్ట్‌ను పరిశీలిస్తున్న వంశధార డీఈ బగ్గు సత్యనారాయణ

ముమ్మరంగా పూడికతీత

పలాసరూరల్: పలాస మండలంలో వంశధార సాగునీటి కాలువల్లో పూడికల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష కాలువలను పరిశీలించి తక్షణం బాగు చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా టెక్కలిపట్నం, గంగువాడ, నారాయణపురం, ఈదురాపల్లి తదితర గ్రామాల్లో వంశధార కాలువలో పేరుకుపోయిన పూడికను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తున్నారు. నైరుతి వర్షాలు రానుండడంతో రైతులకు సాగుకు నీరందించేందుకు కాలువ పనులు ముమ్మరం చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


నారాయణపురం వద్ద కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

జగన్నాయకులు ఆశయ సాధనకు కృషి

హరిపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం తపన పడిన దివంగత మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు ఆశయ సాధనకు కృషిచేయాలని ఆయన సతీమణి జుత్తు ధనలక్ష్మి, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జుత్తు నీలకంఠం అన్నారు. మందస మండలం బిమిడి గ్రామం జగన్నాయకులు ఘాట్‌లో జయంతిని ఆదివారం నిర్వహించారు. బేతాళపురంలో బత్తిన లక్ష్మణ్, హరిపురం, నారాయణపురం గ్రామాల్లో సర్పంచ్‌లు పురుషోత్తం, తేజేశ్వరరావు ఆధ్వర్యంలో జుత్తు జగన్నాయకులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి విశేష సేవలందించాలని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో జుత్తు కూర్మారావు, సౌర ఢిల్లీ శ్వరరావు, హరికృష్ణ, బచ్చల మధు తదితరులు పాల్గొన్నారు.


బిడిమిలో జగన్నాయుకుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

26న శ్యామసుందర స్వామి కల్యాణం

టెక్కలి: టెక్కలి-తొలుసూరుపల్లి రోడ్డులోని శ్యామసుందర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 26న ఉదయం 8 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పక్షవాత బాధితురాలికి సాయం

టెక్కలి: చిన్నరోకళ్లపల్లి గ్రామానికి చెందిన మెండబోయిన గౌరమ్మ కొంతకాలంగా పక్షవాతానికి గురికావడంతో లివింగ్ స్టోన్ చర్చి ఫాదర్ కణితి అబ్రహం ఆదివారం రూ.10,800 నగదు అందించారు. ఈ మొత్తాన్ని ఆమె భర్త ముసలయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారికి ముసలయ్య కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామానికి దూరంగా శ్మశానవాటిక నిర్మించండి

పోలాకి: పోలాకి మండల కేంద్రంలో రోడ్డుకు ఆనుకుని దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారని, గ్రామానికి దూరంగా శ్మశాన వాటిక నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారిలో దహన సంస్కారాల వల్ల అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశామని, తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

గడ్డివాము దగ్ధం

వజ్రపుకొత్తూరు: నగరంపల్లిలో బాడ వైకుంఠరావుకు చెందిన రెండెకరాల గడ్డి వాము ఆదివారం అగ్నికి ఆహుతైంది. గడ్డి వాముకు మంటలు వ్యాపించగా కాశీబుగ్గ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా అప్పటికే గడ్డివామంతా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. పశువుల ఆహారం కోసం ఉంచిన గడ్డి అగ్నికి ఆహుతవడంపై రైతు ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తుతెలియని దుండగులు నిప్పంటించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. ఈ సంఘటపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తారురోడ్డు పనులకు భూమిపూజ

వజ్రపుకొత్తూరు: డెప్పూరు నుంచి మందస మండలం బహడపల్లి వరకు తారురోడ్డు పనులకు ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు పీఎంజీఎస్‌వై నిధులు రూ.1.30 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఆరునెలల్లోనే రోడ్డు పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి, మోట్టూరు, గునుపల్లి పంచాయతీల టీడీపీ నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నకు వెండి నాణేల వితరణ

టెక్కలి: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామికి టెక్కలి మండల తెలుగుయువత అధ్యక్షుడు కోళ్ల కామేసు దంపతులు శనివారం రెండు కేజీల వెండి నాణేలను వితరణగా అందించారు. ఆదివారం ఆలయాన్ని సందర్శించి ఆలయ అధికారులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


అధికారికి వెండి నాణేలు అందిస్తున్న కామేసు

పబ్లిక్ నోటీసు
D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751

పబ్లిక్ నోటీసు
టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్, డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం, సెల్: 9247315759

పబ్లిక్ నోటీసు
టి.బాల మురళీకృష్ణ, అడ్వకేట్, డోర్ నెం.11-6-59, కొల్లా వారి వీధి, శ్రీకాకుళం, సెల్: 9247315759







ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

బిల్లులు కాక.. పనులు సాగక..

● వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు అగచాట్లు
● ఇదీ కళింగపట్నం ఎత్తిపోతలు పథకం పరిస్థితి


(గార)

గార మండలంలోని శివారు ప్రాంతాల్లో వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరందించే కళింగపట్నం ఎత్తిపోతలు పథకం పనులు వైసీపీ పాలకుల నిర్లక్ష్యం పుణ్యమాని పడకేశాయి. గార వద్ద వంశధార నది ఒడ్డున టీడీపీ ప్రభుత్వ హయాంలో కళింగపట్నం ఎత్తిపోతలు పథకం పనులు ప్రారంభించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకుసాగలేదు. దీంతో నీటికోసం అన్నదాతకు అగచాట్లు తప్పడం లేదు.ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎత్తిపోతల పథకం పూర్తికావడంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి.


పంపు షెడ్ పక్కన తుప్పల్లో ఉన్న మోటార్లు

ఇదీ పరిస్థితి

కళింగపట్నం ప్రాంతంలో భైరి కాలువ శివారు ప్రాంతంలో గల 2,200 ఎకరాలకు సాగు నీరందించే ఉద్దేశ్యంతో 2018 ఫిబ్రవరి 24న రూ. 275.63 కోట్ల నిధులతో గార వద్ద వంశధార నది ఒడ్డున ఎత్తిపోతల పథకం కోసం భూమి పూజల చేశారు. పైపు లైన్లు, ఊట బావి నిర్మాణం, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పాటుమోటార్లు కూడా అప్పట్లోనే తెప్పించారు. టీడీపీ హయాంలో పనులు శరవేగంగా చేపట్టారు. ఇంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ పథకం పనులు పూర్తయితే ఆయకట్టుకు నీరందుతుందని ఆశించిన అన్నదాతలు ఆశలు అడిఆశలయ్యాయి. వీటికోసం లక్షలాది రూపా యలు ఖర్చుచేసి కొనుగోలుచేసిన పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఊట బావి చుట్టూ పొదలు


ఊట బావి చుట్టూ పెరిగిన పొదలు


పంపు హౌస్ ఇలా..

భారీగా పెరిగాయి.విద్యుత్ పరికరాలు తుప్పు పడుతున్నాయి. ఏపీఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణలో సుమారుగా 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పదిశాతం పనులు పూర్తిచేయడానికి వైసీపీ పాలకులు దృష్టిసారించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. తక్షణమే ఖరీఫ్‌కు నీరందించేలా కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాలువలు లేక..మురుగు తొలగించక

● ఇదీ కంచిలిలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో పరిస్థితి

కంచిలి: కంచిలిలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధానరహదారి పక్కన కాలువలు లేకపోవడంతో రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉంటోంది. మురుగు నీరు చేరుతుండడంతో వాహనచోదకులు,ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గం ఎస్ఆర్‌సీపురం పంచాయతీ పరిధిలోని వస్తుంది. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఈ మార్గంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ చేరుతున్న మురుగునీరు తొలగించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకవడంతో దుర్వాసనతో అవస్థలుపడుతున్నామని పలువురు వాపోతున్నారు. రహదారికి ఆనుకుని కాలువలు లేకపోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీరంతా గుంతల్లో చేరుతోంది. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో మురుగుతోపాటు బురదమయంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు తొలగించడంతోపాటు డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఎస్ఆర్‌సీపురం పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన నిల్వ ఉన్న మురుగునీరు

సత్తాచాటిన అల్లినగరం విద్యార్థులు

ఎచ్చెర్ల: మండలంలోని అల్లినగరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు హైదరాబాద్‌లోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న సెమ్స్ ఫౌండేషన్ నిర్వహించిన పరీక్షలో సత్తాచాటారు. ఏడో తరగతికి చెందిన కాపల హరి రాష్ట్రస్థాయిలో ఏడో ర్యాంకు, ఎనిమిదో తరగతికి చెందిన కాపల తనుశ్రీ జోనల్ స్థాయిలో 18వ ర్యాంకు, పదో తరగతికి చెందిన బండారు సుకన్య రాష్ట్ర స్థాయిలో 10వ ర్యాంకును సాధించారు.ఈ మేరకు వారికి శ్రీకాకుళంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డీఈవో కె.వెంకటే శ్వరరావు, సెమ్స్‌ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. విద్యా ర్థులు చూపిన ప్రతిభ పట్ల పాఠశాల హెచ్ఎం పార్థసారధి, ఉపాధ్యాయులు అభినందించారు.


డీఈవో వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కాపల తనుశ్రీ

ఏపీబీఎస్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన ఏపీబీఎస్‌టీఎఫ్ కార్యవర్గం

గుజరాతీపేట: శ్రీకాకుళం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ బయాలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం (ఏపీబీఎస్‌టీఎఫ్) కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఫోరం జిల్లా సమావేశం గౌరవాధ్యక్షుడు కవిటి కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవశాస్త్ర బోధన ప్రక్రియలు మరింతగా అభివృద్ధి చేసేందుకు, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండేలా తీర్చిదిద్దేందుకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవసలహాదారుగా ఎస్.కుమారస్వామి, సలహాదారుగా ఎస్.ఉమామహేశ్వరి, గౌరవా ధ్యక్షులుగా కవిటి కుమార్, పుట్టా ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా గగనకుమారి, ప్రధాన కార్యదర్శిగా పూజారి గోవిందరావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా వి. త్రివిక్రమ్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రమోద్‌కుమార్ పాడి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో- 117 రద్దు చేయాలి

● ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతాచార్యులు

ఇచ్ఛాపురం: జీవో-117ను వెంటనే రద్దు చేసి 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ అనంతాచార్యులు కోరారు. ఆదివారం ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు పి.శంకర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా అనంతాచార్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి జి.ఉమాశంకర్, ఎం.సూర్యం, రాజు, ఆర్‌వీజీకే ఆచార్యులు, రవీంద్రబాబు, తులసీరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనంతాచార్యులు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ సేవలు అజరామరం

కాశీబుగ్గ/పలాస: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ సేవలు అజరామరమని బీజేపీ నాయకులు అన్నారు. శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాశీబుగ్గ శక్తి కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. 1947 స్వాతంత్ర్యం అనంతరం జరిగిన పరిణా మాల్లో ఆయన జనసంఘ్ పార్టీ స్థాపించి ప్రజాస్వామ్యంగా పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలవలస వైకుంఠరావు, వైశ్యరాజు మోహనరాజు, కంచరాన భుజంగరావు, గణేష్, మధుకేశ్వరరావు పాల్గొన్నారు.

● **గార:** భారత్ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆదర్శవంతమైన వ్యక్తి అని బీజేపీ నాయకులు తెలిపారు. గార బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆత్మార్పణదినం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఆరంగి తిరుపతిరావు,బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పండి యోగేశ్వరరావు, బీజేవైఎంజిల్లా ప్రధానకార్యదర్శి రాజు వెంకట్,మండల ప్రధా న కార్యదర్శి గుడేటి శ్రీనివాస్, రాజశేఖర్, తోట చిన్నారావ్ పాల్గొన్నారు.

●**ఇచ్ఛాపురం:**ఇచ్ఛాపురంలోని బీజేపీకార్యాలయంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివాస్‌నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగి లక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీకే ప్రసాద్, భగవాన్, శంకర్‌నారాయణ, రమేష్, జోగారావు, కేశవ పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** ఆనందపురంలో బీజేపీ మండలాధ్యక్షుడు వజ్జిపర్తి రఘురాం ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొగిరి దాశరధి పాల్గొన్నారు.


జి.సిగడాం : శ్యామ్‌ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

నిర్వహణ లేక.. ఆహ్లాదం కరువు

● పాడైన ఫౌంటైన్.. విరిగిపోయిన ఆట వస్తువులు
● ఇదీ ఇచ్ఛాపురంలోని గాంధీ పార్క్‌ దుస్థితి

మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీపార్క్ నిర్వహణ లోపం పుణ్యమాని పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువవుతోంది. సాయంత్రం వేళ సేదదీరడానికి పార్క్‌లో వసతులు కొరవడ్డాయి. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు లేకపోవడంతో వృద్ధులు, మహిళలు అవస్థలకు గురవుతున్నారు. విధి నిర్వహణలో రోజంతా ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులు, ఇళ్లలో పనులతో అలసిపోయే గృహిణులు ఉపశమనం పొందేందుకు సాయంత్రం ఇక్కడకు వస్తుంటారు.ఈ పార్క్ చెట్లు, పచ్చదనం లేక పోవడంతో ఎండలోనే కాలక్షేపం చేయాల్సి వస్తోంది. పిల్లల ఆట వస్తు వులు కూడా పాడయ్యాయి. ఆటసామగ్రి విరిగిపోవడంతో చిన్నారులు నిరాశ చెందుతున్నారు. నిత్యం శుభ్రం చేయకపోవడంతో సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్క్‌లో ఉదయం వ్యాయామం కోసం ఏర్పాటుచేసిన జిమ్ పరికారాలు నిర్వహణ లేక పాడవుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన ఫౌంటైన్ పాడై ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. -ఇచ్ఛాపురం


నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన ఫౌంటైన్


పాడవడంతో వినియోగంలో లేని ఆట వస్తువులు

సంప్రదాయానికి తిలోదకాలిచ్చిన జగన్

●ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస: శాసనసభ సంప్రదాయాలను కాపాడుతానని శాసన సభ్యుడిగా ప్రమాణ స్వీకారంచేసిన మరుసటిరోజే సభ సంప్రదాయాలకు మాజీ సీఎం జగన్ తిలోదకాలు ఇచ్చారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ విమర్శించారు. శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆదివారం జిల్లాకు చేరుకున్నారు.ఈ మేరకు ఆమదాలవలస పట్టణంలోని కృష్ణాపురం జంక్షన్ వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్లు ముఖ్య మంత్రిగా పనిచేసిన జగన్మోహన్‌రెడ్డి స్పీకర్ ఎన్నికరోజు పాటించాల్సిన శాసన సభ సంప్రదాయాలను కూడా మంటగలిపే విధంగా ప్రవర్తించడం శోచనీయమన్నారు.నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి ఆయా పరిసరప్రాంతాల్లో ఉన్న ప్రజలు కూడా సహకరించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు పీరుకట్ల విశ్వప్రసాద్, తమ్మినేని గీతా విద్యాసాగర్, ఆనెపు రామకృష్ణనాయుడు, శివ్వాల సూర్యనారాయణ, తమ్మినేని శేఖర్,సనపల డిల్లీశ్వరరావు, బి.గోవిందరావు,ఎస్.మురళీధరరావు, టి.గురయ్య, కిల్లి సిద్దార్థ, శేషు, నాలుగు మండలాలతో పాటు మునిసిపాలిటీ పరిధిలో గల కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు ఘన స్వాగతం

ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి ఆదివారం తొలిసారి జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా విశాఖ విమానాశ్రయం నుంచి ఆమదాల వలసలోని కృష్ణాపురం వరకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు కళింగ సామాజిక వర్గానికి చెందిన వేలాది మంది అభి మానులు ఆహ్వానం పలికారు.ఆమదాలవలసలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మునిసిపాలిటీలో నివివిధ శాఖలకు చెందిన అధికారులతోపాటు పలు విభాగాల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు రవికుమార్‌కు స్వాగతం పలికారు. ఆమదాలవలస పట్టణంలోని కృష్ణాపురం కూడలి వద్ద గాజుల కొల్లివలస గ్రామానికి చెందిన గేదెల హరికృష్ణ రూపొందించిన కూన రవికుమార్ సైకత స్వాగత శిల్పం ఆకట్టుకుంది.


ఆమదాలవలసలో స్వాగతం పలికేందుకు తరలివచ్చిన అభిమానులు(ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కూన రవికుమార్

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


కోలాట నృత్యం ప్రదర్శిస్తున్న కౌసల్య రామ కోలాట బృందం

అరసవల్లి:అరసవల్లి ఆదిత్యుని ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సూర్యనారాయణస్వామివారి దర్శించుకోవడానికి జిల్లాలోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులుతరలివచ్చారు. కాగా ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.6,05,009ల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.3,08,400, విరాళాల ద్వారా రూ.71,749లు, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.2,24,860ల ఆదాయం లభించినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.అలాగే నర్సీపట్నానికి చెందిన మోటమర్రి శ్రీనివాస్ స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శిం చుకున్నారు. అనంతరం వారి తండ్రి జోగారావు జ్ఞాపకార్థం వీల్‌చైర్‌ను ఈవో చంద్రశేఖర్‌కు అందజేశారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆమదాలవలసకు చెందిన కౌసల్య రామ కోలాట బృందం కోలాట నృత్యం ప్రదర్శించింది.

కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం: మండలంలోని పెంటలో కనకదుర్గాదేవి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ముగింపు పురస్కరించుకుని దుర్గమ్మ ఉత్సవ విగ్రహాలతో ఆదివారం తిరువీధి నిర్వహించారు.అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మహిళలు మొక్కులు చెల్లించారు.

●జి.సిగడాంమండలంలోని పాతపెంటలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమవార్షికోత్సవ యాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. వేద పండితులు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, వినోద కార్యక్రమాలతో పాటు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ధర్మకర్త బమిడి పాటి బబ్బుల స్వామి తెలిపారు.

● **ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురంలో ధనరాజ తులసమ్మ సంబరాన్ని ట్యాక్సీ యూనియన్ సభ్యుల నిర్వహించారు.కారుస్టాండ్ నుంచి మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు. మహిళలు బిందెలతో పానకాలు, పంచామృతాలు తీసుకెళ్లి అమ్మవారికి చల్లదనం చేశారు.


జి.సిగడాం: మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్తున్న మహిళలు

అవగాహన లేక..అమలుకు నోచుకోక

● అటకెక్కిన ప్లాస్టిక్ నిషేధం ● చోద్యంచూస్తున్న యంత్రాంగం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మునిసిపాలిటీలో ప్లాస్టిక్ కవర్లు, పాలిథిన్ వినియోగం నిషేధించినా ప్రజలకు అవగాహన లేకపోవడంతో అమలు ప్రక్రియ అటకెక్కుతోంది. ప్రధానంగా వీటి వినియోగం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న విషయం విదితమే. అయితే జిల్లాకు శివారున ఉండడంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ వీటి వినియోగం మరింతగా పెరుగుతోంది. మునిసిపాలిటీ పరిధిలో 37 వేల జనాభా నివసిస్తోంది. వీరంతా ప్రతి పనికి ప్లాస్టిక్ కవర్లపైనే ఆధార పడుతున్నారు. ప్రతి చిన్న వస్తువుకు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లనే ఉపయోగిస్తున్నారు. వీని వినియోగంపై నిషేధం ఉన్నా యంత్రాంగం నిర్లక్ష్యం పుణ్యమాని వీటి అమ్మకం బహిరంగంగానే జరుగు తున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, పాలిథిన్ వల్ల భవిష్యత్ తరాలకు నష్టం వాటిల్లుతుందన్న విషయంపై అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్న విషయం విదితమే. ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధం అమలు పర్యవేక్షించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది.


ఇచ్ఛాపురంలో పేరుకుపోయిన జనావాసాల్లో ప్లాస్టిక్ కవర్లు

కాగా మునిసిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధించినట్లు మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్లాస్టిక్ అమ్మకాలు ఎక్కడైనా జరిగితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మునిసిపాలిటీలో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గినట్లు చెప్పారు.

బారువలో పారిశుధ్యపనులు

సోంపేట: బారువ పంచాయతీలో డీఎల్‌పీవో ఐవీ రమణ ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్యపనులను చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలో చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఈవో తదితరులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

ఇచ్ఛాపురం : సంఘాల బలోపేతానికి సంఘ సభ్యులు కృషి చేయాలని ఏపీఎం సనపల ప్రసాద్ కోరారు. ఆదివారం డొంకూరులో గ్రామ సంఘం వార్షిక మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల బలోపేతానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామ సంఘం కట్టుబాట్లు అనుసరించి గ్రూపులు నడపాలని, శాసనాత్మక బాధ్యతలు, ప్రాజెక్ట్ ప్రాధాన్యతను వివరించారు.


మాట్లాడుతున్న ప్రసాద్

గుణాత్మక విద్యనందించాలి


మాట్లాడుతున్నడీపీ చౌదరి

సోంపేట: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని ఒడియా డీఐ డీపీ చౌదరి కోరారు. ఆదివారం సోంపేట ప్రభుత్వోన్నతపాఠశాలలో సోంపేట, కంచిలి ఒడియా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియావిద్యార్థులు పెరిగేలా ప్రతిఒక్కరూ చర్యలు చేపట్టాలన్నారు.బడికిపోదాం కార్యక్రమంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. సమావేశంలో ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పాడి, కార్యదర్శి బృందావన దళాయి, రామహరి పాడి, బేసి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భజన గురువు మృతి

రణస్థలం: జేఆర్‌పురానికి చెందిన భజన గురువు ఉంగరాల ఆదినారాయణ (71) శనివారం రాత్రి మృతిచెందారు. బీసీ హాస్టల్‌లో కుక్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆయన ఈ ప్రాంతంలో భజన గురువుగా ప్రాచుర్యం పొందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆదినారాయణ మృతిపట్ల కళాకారులు బోనం గురుమూర్తి, కొమనాపల్లి శివరామ్, భజన గురువు పైడిపల్లి ప్రకాష్, గంగి గోపాలకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తంచేశారు.

సత్యసాయి భజన మండలి ఏర్పాటు

ఎచ్చెర్ల: మండలంలోని కొంగరాంలో సత్యసాయి భజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు ప్రేరణతో భజన మండలి ఏర్పాటుచేసినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. భజన మండలి ఆధ్వర్యంలో బాలబాలికలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండగలు, మానవతా విలువలు, జీవన నైపుణ్యాలు తదితర వాటిని వివరించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుండ రవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావు పాల్గొన్నారు.